క్లుప్తంగా

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 15, పచ్చిమిర్చి 50–60, బెండ 40, కాకర 50–60, దొండ 20–30, దోస 30, ఆలు 25–30, చామ 60, కీర 30, బీర 50–60, వంకాయ 30, గోకర 50–60, బీన్స్ 80, బీట్‌రూట్ 30–40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 40, చిక్కుడు 60, ఉల్లి 100 (5–6 కేజీలు), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 30–40 సొరకాయ (కేజీ) 20–30, అల్లం 140, వెల్లుల్లి 130.

భారీ వర్షం

గచ్చిబౌలి/శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధిలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కాలనీలు, బస్తీలలోని ప్రధాన, అంతర్గత రోడ్లపై వర్షం నీరు పారడంతో వాహనదారులు, పాదచారులు అవస్థలుపడ్డారు. పలు చోట్ల విద్యుత్ నిలిచిపోయింది. కాగా వర్షంతో వాతావరణం చల్లబడింది.

పాజిటివ్ కేసులు నిల్

గచ్చిబౌలి: కొండాపూర్ ఏరియా జిల్లా ఆస్పత్రిలో నిర్వహించిన కొవిడ్ టెస్టలలో పాజిటివ్ కేసులు నిల్ అని సూపరింటెండెంట్ డాక్టర్ వరదాచారి తెలిపారు. మంగళవారం 39 మందికి కొవిడ్ టెస్టలు నిర్వహించామని పేర్కొన్నారు. ఏడుగురికి ఆర్టీపీసీఆర్, 32 మందికి రాపిడ్‌యాంటిజెన్ టెస్టులు చేశామన్నారు.

చిన్నారికి అరుదైన చికిత్స



మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స గురించి వివరిస్తున్న డా.అశీస్ సప్రె తదితరులు

మాదాపూర్: పదకొండు నెలల పాపకు మెడికవర్ ఆసుపత్రి డాక్టర్లు అరుదైన చికిత్సతో ప్రాణాలు కాపాడారు. పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ అశీస్ సప్రె మంగళవారం మాట్లాడుతూ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న శిశువుకు ఆపరేషన్ లేకుండా చికిత్స చేసినట్టు తెలిపారు. సొమాలియాకు చెందిన ముస్తల్సా అబ్రిస్కు అహ్మద్ అనే 11 నెలల పాప 7కిలోల బరువుతో ఉన్నట్టు తెలిపారు. గుండెలో వెంట్రిక్యులర్ సెప్టల్ డిఫెక్ట్ (వీఎస్‌డి) రంధ్రంతో బాధపడుతున్నట్టు తెలిపారు. పుట్టుకతో వచ్చే గుండె సమస్య కావడంతో కోత కుట్లు లేకుండా తొడ భాగం రక్తనాళం లోనికి పంపించి వీఎస్‌డి పరికరం అమర్చి(డ్రోయిన్ పద్ధతి) రంధ్రాన్ని పూడ్చారు. పాప కోలుకోవడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సెంటర్‌హెడ్ మాతప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి

మియాపూర్: మియాపూర్ నడిగడ్డతండాలో తండా కమిటీ ఆధ్వర్యంలో స్వర్గీయ కామ్రేడ్ పోగుల ఆగయ్య, మద్దికాయల లక్ష్మమ్మ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంసీపీఐయూ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి మైదంశెట్టి రమేష్, ఇస్లావత్ దశరథ్ నాయక్, కుంభం సుకన్య, తుకారాం నాయక్, కర్ర దానయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి సరికొత్త మహీంద్రా బొలెరో

రాయదుర్గం: మహీంద్రా సరికొత్త బొలెరో ఎంఎక్స్ఎక్స్ పిక్-అప్ వాహనాన్ని హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని ఐటీసీ కోహినూర్ హోటల్‌లో మంగళవారం ఆవిష్కరించారు. ఎం అండ్ ఎం ఆటోమోటివ్ డివిజన్ అధ్యక్షుడు విజయ్ నక్రా మాట్లాడుతూ సరికొత్త బొలెరో ఎంఎఎక్స్ఎక్స్ శ్రేణి అత్యాధునిక ఫీచర్లు, సాటిలేని శక్తి, అధిక మైలేజీని అందిస్తుందన్నారు ఎంఅండ్ఎం ఆటోమోటివ్ టెక్నాలజీ అండ్ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ అధ్యక్షుడు ఆర్ వేలుసామి మాట్లాడుతూ ఎంఎఎక్స్ఎక్స్ శ్రేణి డ్రైవింగ్ అనుభవాన్ని మెరుగుపర్చడానికి ఉత్పాదకతను పెంచడానికి ప్రతి ఫీచర్ నిశితంగా రూపొందించబడిందన్నారు. కార్యక్రమంలో మహీంద్రాగ్రూపు జోనల్ హెడ్ అనురాగాన్స్‌రాయ్, ప్రతినిధులు పాల్గొన్నారు.

భెల్ పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికుడు మృతి



భాస్కర్ గౌడ్ మృతదేహం

రామచంద్రాపురం (పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ పరిశ్రమలోని 4వ బ్లాక్ సమీపంలో ఓ కాంట్రాక్ట్ కార్మికుడు రేకుల పైనుంచి కిందపడి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఉప్పల్ ప్రాంతానికి చెందిన భాస్కర్ గౌడ్(39) భెల్ పరిశ్రమలో కాంట్రాక్టర్ రమేశ్ పరిధిలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం 3గంటల సమయంలో భాస్కర్ గౌడ్ 4 బ్లాక్ సమీపంలో షెడ్ పైకి ఎక్కి ఫ్యాన్ బిగిస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు పైనుంచి కింద పడిపోయాడు. తీవ్రగాయాలపాలైన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మెరుగైన నీటి సరఫరా దిశగా..

- కాలనీలు, బస్తీల్లో మరో 100 కిలోమీటర్లు పైప్‌లైన్లు
- సమస్యల పరిష్కారానికి కొత్తగా సెక్షన్లు ఏర్పాటు
- వేసవిలో తాగునీటి ట్యాంకర్ల సరఫరాల సమయం పెంపు
- అక్రమ కనెక్షన్లపై క్రిమినల్ కేసులు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో జలమండలి జీఎం రాజశేఖర్





శేరిలింగంపల్లి 15వ డివిజన్ జలమండలి కార్యాలయం

హఫీజ్‌పేట్ : శేరిలింగంపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా తాగునీటి సమస్య రాకుండా చూస్తున్నామని, మెరుగైన నీటి సరఫరా కోసం కాలనీలు, బస్తీల్లో మరో 100 కిలోమీటర్లు పైప్‌లైన్లు వేస్తున్నట్టు జలమండలి శేరిలింగంపల్లి డివిజన్ జనరల్ మేనేజర్ రాజశేఖర్ వివరించారు. వేసవి దృష్ట్యా తాగునీటి ట్యాంకర్ల సరఫరా సమయం పెంచినట్టు చెప్పారు. అలాగే పాలనాపరమైన సమస్యల పరిష్కారానికి కాలనీలు, బస్తీలకు మరింత చేరువగా ఉండేందుకు కొత్తగా మరిన్ని సెక్షన్లు చేశామని జీఎం రాజశేఖర్ సోమవారం 'సాక్షి' ఇంటర్వ్యూలో తెలిపారు.

ప్రశ్న : శేరిలింగంపల్లి డివిజన్‌లో ఎన్ని తాగునీటి కనెక్షన్లు ఉన్నాయి ?

జ : మొత్తం 80వేల కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో డొమెస్టిక్ 56,000, కమర్షియల్ 4,500, బస్తీల్లో 12,500, ఇతర కనెక్షన్లు 7000 ఉన్నాయి.

ప్ర : ఉన్న రిజర్వాయర్లు.. వాటి సామర్థ్యం ఎంత ?

జీఎం : శేరిలింగంపల్లి జలమండలి పరిధిలో 33 రిజర్వాయర్లు ఉన్నాయి. మొత్తం సామర్థ్యం 106.70 ఎంఎల్. వీటిలో అత్యధికంగా 21.80 ఎంఎల్ సామర్థ్యం పటాన్‌చెరు సెక్షన్‌లో ఉండగా, అత్యల్పంగా 0.90 ఎంఎల్ సామర్థ్యం హఫీజ్‌పేట్ సెక్షన్‌లో ఉన్నాయి.

ప్ర : వేసవిలో నీటి సమస్య పరిష్కారానికి తీసుకున్న చర్యలు ఏమిటి ?

జ : నీటి సమస్య ఉన్న ఏరియాల్లో తాగునీటి ట్యాంకర్ల సమయాలు పెంచాం.ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు బుక్ చేసుకోవచ్చు. మాదాపూర్, కొండాపూర్‌లలో అధికంగా తాగునీటి ట్యాంకర్లు బుకింగ్స్ వస్తున్నాయి.

ప్ర : ఎన్ని కిలోమీటర్లు పైప్‌లైన్లు వేశారు ?

జ: పదకొండు సెక్షన్ల పరిధిలో 1022.87 కిలోమీటర్ల పైప్‌లైన్ నెట్‌వర్క్ ఉంది. ప్రతి కాలనీ, బస్తీల్లో కొత్తగా పైప్‌లైన్ వేసి తాగునీరు అందిస్తున్నాం. నూతనంగా టీఎన్‌జీఓ కాలనీలో 12 కిలోమీటర్లు, జర్నలిస్టు కాలనీలో 2 కిలోమీటర్ల పైప్‌లైన్లు వేయడం జరిగింది.

ప్ర : ఒక ఇంటికి రెండు తాగునీటి కనెక్షన్లు ఇస్తున్నారా ?

జ: గతంలో ఒక ఇంటికి రెండు కనెక్షన్లు ఇవ్వలేదు. ఇప్పుడు ఒక ఇంటిలో ఎక్కువ కుటుంబాలు ఉన్నా, కరెంటు మీటర్లు ఉన్న వారికి రెండో కనెక్షన్ ఇస్తున్నాం. కానీ రెండవ కనెక్షన్‌కు 20వేల లీటర్ల ఉచిత తాగునీరు పథకం వర్తించదు.

ప్ర : శేరిలింగంపల్లిలో సివరేజ్ పైప్‌లైన్ వేస్తున్నారా ?

జ : గత సంవత్సరం మార్చి నుంచి ఒకొక్క కార్పొరేటర్ డివిజన్‌లో 1.5 కిలోమీటర్ల మేర పాత పైప్‌లైన్‌లో స్థానంలో కొత్త పైప్‌లైన్ వేస్తున్నాం. సివరేజ్ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా ఈ పైప్‌లైన్ వేయడం జరిగింది.

ప్ర : అక్రమ నల్లా కనెక్షన్లపై..

జ : అక్రమ నల్లా కనెక్షన్లను రెగ్యులరైజ్ చేశాం. ఎక్కడైనా ఉంటే చర్యలకు ప్రత్యేక విజిలెన్స్ బృందాలను ఏర్పాటు చేశారు. అక్రమ నల్లా కనెక్షన్లను గుర్తించి చర్యలు తీసుకుంటాయి. ఇప్పటి వరకు నలుగురిపై కేసులు పెట్టాం.

ప్ర : ఉచిత నీటి పథకం కోసం ఆధార్‌కు ఎన్ని కనెక్షన్లు అనుసంధానం చేశారు ?

జ : 11 సెక్షన్లు కలిపి మొత్తం 43,444 కనెక్షన్లు ఆధార్‌కు అనుసంధానం చేశారు. వీటిలో అత్యధికంగా నల్లగండ్ల సెక్షన్‌లో 6,123 కనెక్షన్లు ఉండగా, అత్యల్పంగా డోయన్స్ సెక్షన్‌లో 2,534 కనెక్షన్లు ఉన్నాయి.

ప్ర : ఆధార్ అనుసంధానం ఎలా చేసుకోవాలి ?

జ : ఆధార్ అనుసంధానం కోసం సంబంధిత ఇంటి పత్రాలు ఉంటే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. నల్లా బిల్లుతో పాటు ఆధార్ నంబర్ జతపర్చాలి. ఆక్యుపెన్సీ, సర్టిఫికెట్, నల్లాకు మీటరు బిగించి ఉండాలి.

మంచినీరు, సివరేజ్ సమస్యల పరిష్కారానికి సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు

శేరిలింగంపల్లి డివిజన్ జనరల్ మేనేజర్ రాజశేఖర్	:9989989535
పీ.జె. శ్రీనారాయణ (డీజీఎం, మాదాపూర్)	:9989988850
బి. యాదయ్య (మేనేజర్, మాదాపూర్)	: 9154297400
నరేందర్‌రెడ్డి (మేనేజర్, గచ్చిబౌలి)	:7331185784
అభిషేక్ (మేనేజర్, నల్లగండ్ల)	:9154867438
సందీప్ కుమార్ (మేనేజర్, కొండాపూర్)	:9550731232
విక్రమ్ రెడ్డి (మేనేజర్, డోయన్స్)	:9989989382
చందానగర్ సబ్ డివిజన్ :	
టి. నాగప్రియ (డీజీఎం, మియాపూర్)	:9989996001
వి. సాయి చరిత (మేనేజర్, మియాపూర్)	:9154866702
ఎస్‌వీఎస్ సుబ్రమణ్యం రాజు (మేనేజర్, చందానగర్)	:9989989045
వై.సునీత (మేనేజర్, దీప్తిశ్రీనగర్)	:9154867431
పూర్ణేశ్వరి (మేనేజర్, హాఫీజ్‌పేట్)	:7331185747
ఆర్సీపురం సబ్ డివిజన్ :	
శివకృష్ణ (డీజీఎం)	:7337350848
ఎం.జనార్దన్ (మేనేజర్, ఆర్సీ పురం)	:9989991590
వి.ప్రవీణ్‌కుమార్ (మేనేజర్, పటాన్‌చెరు)	:8790011977
మంచినీటి ట్యాంకర్ కోసం	**: 155313**

డ్రంకన్ డ్రైవ్.. జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 29 మంది పట్టుబడ్డారని తెలిపారు.

చీరకట్టు .. అదిరేట్టు



అందాల ముద్దుగుమ్మలు చీరకట్టులో సంప్రదాయాన్ని ఒలకబోశారు. రంగురంగుల చీరలు ధరించి హొయలొలికించారు. చీర ఔన్నత్యాన్ని చాటుతూ వయ్యారి నడకలతో ర్యాంప్‌పై మెరిశారు. బేగంపేటలోని ఐటీసీ కాకతీయ హోటల్‌లో మంగళవారం ఎస్‌వీఎస్ గ్రూప్ హైదరాబాద్ ఆధ్వర్యంలో అనంత పేరిట నూతన బ్రాండ్ చీరలను విడుదల చేశారు. ఆదిత్య బిర్లా గ్రూప్‌కు చెందిన లివా ఫ్యాబ్రిక్, మీనా ప్రింట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ల సహకారంతో సరికొత్త బ్రాండ్‌తో ఆకర్షణీయమైన చీరలను మార్కెట్లోకి విడుదల చేయడం జరిగిందని ఎస్‌వీఎస్ గ్రూప్ ప్రతినిధులు చింతల శ్రీనివాస రావు, రమేష్, సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బిర్లా సెల్యులోస్ గ్రాసిమ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సీఎంఓ మన్మోహన్‌సింగ్, ఏపీపీ బిజినెస్ డెవలప్‌మెంట్ ప్రియాంక ప్రియదర్శిని, మీనా ప్రింట్స్ ఎండీ భరత్ పాల్గొన్నారు. –సనత్‌నగర్

తెలుగుభాష, సాహిత్యానికి ఎనలేని కృషి



రవ్వా శ్రీహరి, బాలశ్రీనివాసమూర్తి చిత్రపటాల వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రొఫెసర్లు, విద్యార్థులు

రాయదుర్గం: ఆచార్య రవ్వా శ్రీహరి, ఆచార్య బాల శ్రీనివాసమూర్తి సాహిత్య కృషి శ్లాఘనీయమని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో తెలుగుశాఖ ఆధ్వర్యంలో జాకిర్ హుస్సేన్ భవనంలో ఆచార్య రవ్వాశ్రీహరి, ఆచార్య గుమ్మన్నగారి బాల శ్రీనివాసమూర్తి సంస్మరణ సభను మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన హెచ్‌సీయూ తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆచార్య శ్రీహరి ఒక పేద కుటుంబం నుంచి వచ్చి వైస్‌చాన్సలర్ స్థాయికి ఎదగడం సామాన్యమైన విషయం కాదన్నారు. ఆచార్య పిల్లలమర్రిరాములు మాట్లాడుతూ ఇరువురు తెలుగు భాష, సాహిత్యాలకు ఎనలేని కృషి చేశారన్నారు. అంతకుముందు వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ ఆచార్యులు గోనానాయక్, పమ్మి పవన్‌కుమార్, డాక్టర్ భూక్యా తిరుపతి, డాక్టర్ బాణాల భుజంగరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ



మియాపూర్: మియాపూర్‌లోని ముజాఫర్ అహ్మద్ నగర్‌లో మే 5,6 తేదీల్లో జరగబోయే ఏఐఎఫ్‌డీవై రాష్ట్ర స్థాయి రాజకీయ విజ్ఞాన తరగతులను జయప్రదం చేయాలని ఏఐఎఫ్‌డీవై గ్రేటర్ హైదరాబాద్ కన్వీనింగ్ కమిటీ సభ్యురాలు డి. కీర్తి పిలుపునిచ్చారు. మియాపూర్‌లోని స్టాలిన్‌నగర్‌లో రాజకీయ విజ్ఞాన తరగతులకు సంబంధించిన కరపత్రాన్ని నాయకులు, సభ్యులతో కలిసి మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ కన్వీనింగ్ కమిటీ సభ్యులు బూసాని రవి, శిరీష్, దశరథ్ నాయక్, నర్సింగ్ తదితరులున్నారు.

వార్షిక న్యూస్‌లెటర్ 'ప్రమోషన్' ఆవిష్కరణ



న్యూస్ లెటర్ ఆవిష్కరణలో ప్రొఫెసర్లు

పటాన్‌చెరుటౌన్: గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ వార్షిక న్యూస్‌లెటర్ ప్రమోషన్ (అన్వేషించు, నేర్చుకో, ఎదుగు)ను ప్రారంభించింది. బీస్కూల్ అధిపతి ప్రొఫెసర్ వినయ్‌కుమార్ అప్పరాజు ఈ న్యూస్ లెటర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ప్రొఫెసర్లు కరుణాకర్ దేవీప్రసాద్, పినాకపాణి పేరి, డాక్టర్ నేనురాజు సుధ తదితరులు ఈ ఆవిష్కరణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన ప్రమోషన్ కమిటీని ప్రకటించారు.ఈ వార్షిక న్యూస్ లెటర్‌ను వెలువరించడానికి కృషి చేసిన ప్రతిఒక్కరిని వినయ్‌కుమార్ అభినందించారు. కొత్త బృందం మంచి ఫలితాలను ఇస్తుందని ఆశిస్తున్నట్టు చెప్పారు. మార్కెటింగ్ క్లబ్ హెడ్ (2021–23 బ్యాచ్) శ్రీవాణి తమ రెండేళ్ల ప్రయాణాన్ని వివరించారు. ప్రమోషన్ నూతన అధిపతి శివాంజలి శివకుమార్ భవిష్యత్ ప్రణాళికను వివరించారు.

అభివృద్ధికి నోచని కాలనీలు,బస్తీలు

బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్

గచ్చిబౌలి: పదేళ్ళుగా శేరిలింగంపల్లిలోని కాలనీలు,బస్తీలు అభివృద్ధికి నోచుకోలేదని, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందని బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ విమర్శించారు. కొండాపూర్ డివిజన్ వినాయక్‌నగర్, విఠల్‌రావునగర్‌లో గడపగడపకూ బీజేపీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమని, అంతటా సమాన అభివృద్ధి చేస్తూ ప్రజలకు పూర్తి స్థాయి మౌలిక వసతుల కల్పనకు అన్ని చర్యలు తీసుకుంటారన్నారు.అంతకుముందు ఆయా కాలనీల్లో ఇంటింటికీ తిరుగుతూ పార్టీ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆంజనేయులు, రాధాకృష్ణయాదవ్, గోపాల్, అనిల్‌కుమార్‌యాదవ్, నరేష్, గోపాలకృష్ణ, రాజు, రమేష్, పద్మ, రేణుక, సరోజారెడ్డి, సంతోషరెడ్డి, నవీన్‌రెడ్డి, మధుయాదవ్ పాల్గొన్నారు.

'పబ్లిక్ కాంటాక్ట్' సమస్యలు పరిష్కరిస్తున్నారా ?

ఆల్విన్‌కాలనీ: బీజేపీ గడప గడపకు కార్యక్రమంలో భాగంగా పార్టీ రాష్ట్ర నాయకుడు రవికుమార్‌యాదవ్ మంగళవారం వివేకానందనగర్ డివిజన్ వెంకటేశ్వర నగర్ వీకర్ సెక్షన్, మాధవరం కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గాల్లో పబ్లిక్ కాంటాక్ట్ పేరుతో 15 శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహిస్తున్నారని, కానీ కార్యక్రమంలో వస్తున్న ఫిర్యాదులను అధికారులు, ప్రజా ప్రతినిధులు క్షేత్ర స్థాయిలోకి వెళ్లి పరిశీలిస్తున్నారా? అని ప్రశ్నించారు. ఇప్పటి వరకు ఎన్ని సమస్యలు పరిష్కరించారో తెలపాలని డిమాండ్ చేశారు. కాలనీల్లో కొన్ని ఇళ్లల్లో నీటి సరఫరా సరిగ్గా జరగడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అయినా పట్టించుకోవటం లేదన్నారు.

బొంబాయి కాలనీలో 'ముఖాముఖి'

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతీనగర్ డివిజన్ పరిధిలోని బొంబాయి కాలనీలో కార్పొరేటర్ మంగళవారం కాలనీవాసులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, వాటిని మార్చాలని దోమల బెడద ఎక్కువ ఉండటంతో అనారోగ్యాలకు గురవుతున్నామని, పలుచోట్ల మ్యాన్‌హోల్‌కు కవర్‌లు లేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని విన్నవించగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్ రెడ్డి, జీహెచ్‌ఎంసీ ఉపకమిషనర్ బాలయ్య కాలనీవాసులకు హామీ ఇచ్చారు.

సమ్మెలో విద్యుత్ ఆర్టిజన్ కార్మికులు



బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ఏఈ కార్యాలయం పరిధిలో పనిచేసున్న విద్యుత్ ఆర్టిజన్ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని విధులు బహిష్కరించి మంగళవారం సమ్మెలోకి వెళ్లారు. దీంతో విద్యుత్ సేవలకు అంతరాయం కలుగకుండా రామచంద్రాపురం పోలీసులు విద్యుత్ కార్యాలయం ఎదుట బందోబస్తు నిర్వహించారు.

వైరల్ అవుతున్న వీడియో..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతీనగర్ డివిజన్ పరిధిలోని పాత ఎంఐజీ కాలనీకు చెందిన ఓ బీఆర్ఎస్ నాయకుడు పలువురికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇప్పిస్తానంటూ డబ్బులు తీసుకున్నట్లు ఓ బాధితుడు చెబుతున్న వీడియో మంగళవారం వైరల్‌గా మారింది. ఈ అంశం స్థానికంగా చర్చనీయాంశమైంది.

ఘనంగా ఆది శంకరాచార్య జయంతి



మియాపూర్: చందానగర్ హుడా కాలనీలోని లక్ష్మీ గణపతి ఆలయం వద్ద శేరిలింగంపల్లి విశ్వకర్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జగద్గురు ఆది శంకరాచార్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశాఖ శ్రీ శారద పీఠం కమిటీ సభ్యులు మిరియాల రాఘవరావు, హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్‌కుమార్, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ రామస్వామియాదవ్, ఆధ్యాత్మిక వేత్త చంద్రశేఖర్ హాజరై ఆది శంకరాచార్య చిత్రపటానికి పూల మాలలు వేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ వ్యాప్తంగా హిందు మతం పురోగతికి తొలి అడుగు వేసిన మహానీయుడు ఆది శంకరాచార్య అని పేర్కొన్నారు. ఆది శంకరాచార్య సిద్ధాంతాలను కొనసాగించాల్సిన బాధ్యత విశ్వకర్మ జాతి సభ్యులపై ఉందన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ విశ్వకర్మ ఫౌండేషన్ అధ్యక్షులు శంకరాచారి, డివిజన్ల అధ్యక్షులు, కార్యదర్శులు, మిరియాల ట్రస్ట్ చైర్మన్ ప్రీతమ్, దేవాదాయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతోంది

చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే గాంధీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

మియాపూర్: తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతోందని, సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపారని ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. మియాపూర్‌లోని నరెన్ గార్డెన్‌లో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల సభ (ప్లీనరీ)ను మంగళవారం నిర్వహించారు. చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే గాంధీ బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించి అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఏకైక సీఎం కేసీఆర్ అని కొనియాడారు. గత ప్రభుత్వాల హయాంలో కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉండేదని, నేడు 24 గంటల పాటు కరెంట్ అందిస్తున్న రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమన్నారు. కేంద్ర ప్రభుత్వం 400 ఉన్న గ్యాస్ ధరను రూ.1200 రూపాయలకు పెంచి పేద ప్రజలకు భారం మోపిందన్నారు. ప్లీనరీ సందర్భంగా పలు తీర్మానాలు ప్రవేశపెట్టారు. వాటికి ప్రజాప్రతినిధులు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు హమీద్ పటేల్, రాగం నాగేందర్‌యాదవ్, జగదీశ్వర్‌గౌడ్, దొడ్ల వెంకటేష్‌గౌడ్, నార్నె శ్రీనివాస్‌రావు, ఉప్పలపాటి శ్రీకాంత్, పూజితగౌడ్, మంజులరఘునాథ్‌రెడ్డి, సింధుఆదర్శ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు సాయిబాబా, మాధవరం రంగారావు, టీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలున్నారు.

జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్ గులాబీమయం

పటాన్‌చెరు: జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్ గులాబీమయంగా మారింది. పల్లె, పట్నం తేడా లేకుండా నియోజకవర్గంలోని ప్రతీగ్రామం, మున్సిపాలిటీ, కాలనీలో పండగ వాతావరణం నెలకొంది .వేలాది మంది కార్యకర్తల సమక్షంలో శాసనమండలి మాజీ చైర్మన్ భూపాల్ రెడ్డి, ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పార్టీ జెండాను ఎగరవేశారు. మినీ ఇండియాగా పేరొందిన పటాన్‌చెరు నియోజకవర్గం అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు.

బీఆర్ఎస్ పార్టీ పతాకావిష్కరణ

గచ్చిబౌలి/రాయదుర్గం/మియాపూర్: బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శేరిలింగంపల్లి నియోజకవర్గం కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, హఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్లలోని కార్పొరేటర్లు పార్టీ పతాకాలను ఆవిష్కరించారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ



హాజరైన నాయకులు, కార్యకర్తలు



పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, పార్టీ నాయకులు